క్లుప్తంగా

సోదర భావానికి ప్రతీక రక్షా బంధన్



సూపరింటెండెంట్ భారతికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

అగనంపూడి: అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో రక్షా బంధన్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. దివ్యజ్యోతి జిల్లా కోఆర్డినేటర్, రాజయోగిని బీకే సోమేశ్వరి అక్కయ్య సోమవారం ప్రత్యేక పూజలు చేసి రక్షా బంధన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రాఖీని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతికి కట్టారు. తర్వాత వివిధ ఫార్మా కంపెనీల యాజమాన్యాలు, వారి ప్రతినిధులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. 19న ముగింపు కార్యక్రమం అట్టహాసంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

13న 'చలో హైదరాబాద్'



మాట్లాడుతున్న మార్టుపూడి పరదేశి

పెదగంట్యాడ: ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల పాటు అలుపెరగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ ఈ నెల 13న హైదరాబాద్ వస్తున్నారని ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు తరలిరావాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ నాయకుడు మార్టుపూడి పరదేశి పిలుపునిచ్చారు. పెదగంట్యాడ ఎస్సీ కాంప్లెక్స్‌లో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) అధ్యక్షుడు అత్తోట రవి కుమార్, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు దేవులపల్లి సంపూర్ణం అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరదేశి మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పోరాట కృషి ఫలితం కారణంగానే సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు పచ్చజెండా ఊపిందని తెలిపారు. ఈ విజయానికి కారకుడైన మందకృష్ణ మాదిగ హైదరాబాద్ వస్తున్నారని, ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. సమావేశంలో గంట్యాడ గోవిందరాజు, డాక్టర్ ఎస్.రాజారావు, కాకినాడ పెంటారావు, గంట్యాడ పైడి కొండ, సింహాచలం, నర్సింగరావు, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

25న 3కే మారథాన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ బాగ్చి

గాజువాక: పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహనకు ఈనెల 25న చేపట్టనున్న 3కే మారథాన్ పోస్టర్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆయన అభినందించారు. ట్రస్టు చైర్మన్ పల్లా కార్తీక్ మాట్లాడుతూ రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ పేరుతో గాజువాకలో నిర్వహించనున్న మూడు కిలోమీటర్ల ర్యాలీలో యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి హాజరైనవారికి ఉచితంగా టీషర్టు, సర్టిఫికెట్, మొక్క అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నవీన్ రెడ్డి, సతీష్, సునీల్, నాగేంద్ర, పరమేష్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కాలేజీ డిగ్రీ ప్రవేశాల జాబితా విడుదల

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి అర్హుల జాబితాను విడుదల చేశారు. విద్యార్థులు ఈ నెల 16వ తేదీలోగా అలాట్‌మెంట్ ఆర్డర్‌తో పాటు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లి ప్రవేశం పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉల్లంఘనులు!

- స్టాపర్లను పక్కకు పడేసిన వైనం
- దూసుకొస్తున్న భారీ వాహనాలు
- చోటుచేసుకుంటున్న ప్రమాదాలు



రోడ్డు పక్కకు జరిపేసిన స్టాపర్



తుప్పల్లో పడేసిన స్టాపర్

పెదగంట్యాడ: వాహనాల వేగాన్ని నియంత్రించి.. ప్రమాదాలను అరికట్టాలనే లక్ష్యంతో న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు గంగవరం రోడ్డులో ఏర్పాటు చేసిన స్టాపర్లు తుప్పల్లో దర్శనమిస్తున్నాయి. పెదగంట్యాడ నుంచి గంగవరం.. ఆపై యారాడ తీరానికి వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఈ మార్గాల్లో ప్రయాణమంటేనే హడలిపోయే పరిస్థితి ఉంది. మరో వైపు పెదగంట్యాడ నుంచి గంగవరం వైపు వెళ్లే రహదారిలో వెంకన్నపాలెం కూడలి వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకోవడంతో వాహనచోదకులు, పాదచారులు హడలిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఆ రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద స్టాపర్లు ఏర్పాటు చేశారు. రెండు మూడు రోజుల పాటు ఆ బోర్డులు రోడ్డుపై ఉన్నాయి. తర్వాత కొన్నింటిని లారీ డ్రైవర్లు పక్కకు తొలగించారు. మరి కొన్ని తుప్పల్లో పడేశారు. దీంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. భారీ వాహనాలు రయ్ రయ్ మంటూ వేగంగా దూసుకొస్తున్నాయి. వాటి వేగాన్ని అదుపు చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ బోర్డులు తుప్పల్లో మూలుగుతుండడంతో ప్రమాదాలు మళ్లీ షరామామూలుగానే జరుగుతున్నాయి. బోర్డులను తుప్పల్లో పడేసినవారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ద్విచక్రవాహన చోదకులపైకి దూసుకువచ్చిన లారీ (ఫైల్)

రాత్రి వేళల్లో భయం



గంగవరం గ్రామం నుంచి స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, గాజువాకలో పనులు చేసుకుంటూ రాత్రి వేళ ఇళ్లకు వెళ్తుంటాం. ఈ రహదారి మొత్తం చీకటి అలుముకోవడంతో పాటు మలుపుల వద్ద వేగంగా వచ్చే భారీ వాహనాలను తప్పించలేక ప్రమాదాల బారినపడుతున్నాం. పోలీసులు ఇక్కడ స్టాపర్లు పెట్టారు. వాటిని తుప్పల్లో పడేశారు. మళ్లీ బోర్డులు ఏర్పాటు చేసి భారీ వాహనాల వేగాన్ని నియంత్రించి, ప్రమాదాలను అరికట్టాలి.

– నొల్లి పోలరాజు, జాలరిపల్లిపాలెం, గంగవరం.

భారీ వాహనాలతో బెంబేలు



ఈ రోడ్డులో భారీ వాహనాలు బెంబేలెత్తిస్తున్నాయి. లారీలు జోరుగా వస్తున్నాయి. లారీ డ్రైవర్లు ఒక్కోసారి వేగాన్ని నియంత్రించలేక పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులపై దూసుకు వస్తున్నారు. యారాడ తీరం నుంచి కార్లు సైతం మితిమీరిన వేగంతో వస్తున్నాయి. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించి వాహనాల వేగాన్ని నియంత్రించాలి. ఈ ప్రదేశంలో ట్రాఫిక్ పోలీస్‌ను ఏర్పాటు చేయాలి..

–కాసారపు దానయ్య, గంగవరం

ఉక్కుపై కుట్రలు తగవు

- కేంద్రం ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలి
- స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రామచంద్రరావు



మాట్లాడుతున్న రామచంద్రరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడున్నరేళ్లుగా ఉక్కు కార్మికులు ఉద్యమాలు చేస్తున్నా కేంద్రం విశాఖ ఉక్కును నష్టపరిచే చర్యలు కొనసాగిస్తూనే ఉందని ఆరోపించారు. పోరాటాల వల్ల ప్రైవేటీకరణ చేయకపోయినా విశాఖ ఉక్కును పూర్తిగా నిర్వీర్యం చేసి అమ్మేసే ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. మూడు బ్లాస్ట్‌ఫర్నేసుల్లో ఒకటి మూడేళ్లుగా మూసేసారని, మిగిలిన రెండింటిని కూడా మూసి వేసే పరిస్థితి కేంద్రం తీసుకు వస్తుందన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రం తక్షణం ఆదుకోకపోతే లక్షలాది కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. పది వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చాలని, అవసరమైన రా మెటీరియల్ సకాలంలో అందేలా చేసి పూర్తిస్థాయిలో ఉత్పత్తిని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామి ప్లాంట్ సందర్శనలో ఆదుకుంటామి భరోసా ఇచ్చినా ఇంత వరకు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.వి. రమణమూర్తి, ప్రభాకరరెడ్డి, బి.ఎన్. రాజు, ఎస్.ఎ. నాయుడు, మోహన్, రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ టోర్నమెంట్



ట్రోఫీలతో డీవైఎఫ్ఐ వాలీబాల్ టోర్నీ విజేతలు

ఆరిలోవ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆరిలోవలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో 20 జట్లు తలపడ్డాయి. ముత్యమాంబ యూత్ జట్టు ప్రథమ స్థానంలో, వైజాగ్ శ్రీను జట్టు రెండో స్థానం, ముత్యమాంబ జూనియర్ జట్టు మూడో స్థానంలో నిలిచాయి. టోర్నీని ప్రారంభించిన ముఖ్య అతిథి ఆరిలోవ సీఐ జి.గోవిందరావు మాట్లాడుతూ యువత కోసం ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత చెడువ్యసనాలకు వెళ్లకుండా క్రీడలపై ఆసక్తి చూపాలని సూచించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షుడు రాజు మాట్లాడుతూ యువత క్రీడల్లో ముందుండాలన్నారు. భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి యోధులు యువతరంలోనే దేశం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. వారి ఆశయ సాధనకు డీవైఎఫ్ఐ కృషి చేస్తోందని చెప్పారు. యువతకు నిరంతరం సహకారం అందిస్తామన్నారు. అనంతరం విజేత జట్లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ నాయకుడు పి.శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రావణ్, ముఖేష్ రాజా, రాజు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన గ్రేటింగ్ బాక్స్

గాజువాక: జీవీఎంసీ చేపడుతున్న పలు నిర్మాణ పనులు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రత్యేకంగా రోడ్ల నిర్మాణ విషయంలో నిబంధనలను కనీసం పాటించడం లేదు. గాజువాక జోనల్ కార్యాలయానికి సమీపంలో కల్వర్టుపై ఏర్పాటు చేసిన గ్రేటింగ్ బాక్స్ ప్రమాదకరంగా మారింది. కల్వర్టు ఒడ్డున అడుగు ఎత్తులో ఈ గ్రేటింగ్ బాక్స్‌ను నిర్మించారు. రాత్రి సమయాల్లో ఆ రోడ్‌లో వెళ్తున్న వారు దాన్ని గుద్దుకొని పడిపోతున్న సంఘటనలు చోటు చేసుకొంటున్నాయి. ఈ బాక్సును రోడ్డుకు పక్కన వేయాల్సి ఉంటుంది. అప్రోచ్‌లకు దూరంగా ఉండాలి. అయితే, ఈ గ్రేటింగ్ బాక్స్‌ను సరిగ్గా రోడ్డు మధ్యలో నిర్మించడంపై ప్రజలు మండిపడుతున్నారు. పని చేస్తున్నప్పుడు అధికారులు, సిబ్బంది పర్యవేక్షించలేదన్న విషయాన్ని ఈ నిర్లక్ష్యం నిరూపిస్తోంది. పని పూర్తయిన తర్వాత కూడా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్లు వేసే సమయంలో స్పీడ్ బ్రేకర్లను పరిమితికి మించిన ఎత్తులో వేయడం, కల్వర్టుల ఎత్తు కూడా నిబంధనలకనుగుణంగా లేకపోవడం పరిపాటిగా మారిందంటూ నివాసులు విమర్శిస్తున్నారు.

చిల్లర సమస్యకు చెక్

క్యూఆర్ కోడ్ స్కానర్ల ఏర్పాటు



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కానర్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు టికెట్ కోసం ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. దీని ద్వారా చిల్లర సమస్యకు కూడా చెక్ పెట్టారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేందుకు వీలుగా మూడు చోట్ల క్యూఆర్ కోడ్ స్కానర్లు ఏర్పాటు చేశారు. క్యూ లైన్లలో నిల్చోవాల్సిన పరిస్థితి లేకుండా ఇవి దోహదపడతాయి. ఒకటో ప్లాట్‌ఫాంతో పాటు టికెట్ కౌంటర్ వద్ద మరొకటి రిజర్వేషన్ కౌంటర్ సమీపంలో ఏర్పాటు చేశారు. రైల్వే ప్రయాణికులు వీటిని సద్వినియోగ పర్చుకోవాలని అధికారులు కోరుతున్నారు.

వయనాడ్‌కు భారీగా దుస్తుల తరలింపు



కార్లలో దుస్తులతో బయలు దేరిన ప్రతినిధులు

గాజువాక : వయనాడ్ వరద బాధితులకు సింహాద్రి టీఎంటీ, ఒడిశా స్టీవ్‌డోర్స్, హిమ హ్యూమానిటేరియన్ అసోసియేషన్లు భారీగా దుస్తులు సమకూర్చాయి. ఈ మేరకు రగ్గులు, దుప్పట్లు, టవళ్లు, చీరలు, పంచెలను ఆయా సంస్థల ప్రతినిధులతో కార్లలో పంపించారు. ఈ సందర్భంగా ఆ కార్లను టీఎస్సార్, టీబీకే కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ శ్రీనగర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు సహాయం చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ బొంగు శ్రీనివాసరావు, ఘోషా ఆస్పత్రి హెడ్ నర్స్ కుప్పిలి మణి, కళాశాల కరస్పాండెంట్ టి.ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు, హ్యూమానిటేరియన్ అసోసియేషన్ ప్రతినిధులు టి.వి.డి.దాస్, జి.వి.హరి తదితరులు పాల్గొన్నారు.

మోడలింగ్‌లో మెరిసిన రిషిక



ట్రోఫీ కైవసం చేసుకున్న తన్వీ రిషిక

డాబాగార్డెన్స్: థాయిలాండ్‌లో జరిగిన జూనియర్ మోడల్స్ ఇంటర్నేషనల్ పోటీలో నగరానికి చెందిన తన్వీ రిషిక విశేష ప్రతిభ కనబరచి రెండో స్థానంలో నిలిచింది. వివిధ దేశాల విజేతల మధ్య జరిగిన హోరాహోరీ పోటీల్లో ప్రిటీన్ కేటగిరీలో తన్వీ రిషిక రెండో స్థానంలో నిలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. కాస్ట్యూమ్స్ విభాగంలో బెస్ట్ రిప్రజెంటేషన్ ఫ్రమ్ ఇండియా, సూపర్ టాలెంట్ ఆఫ్ సీజన్ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా తన్వీ రిషిక మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇప్పటికే చాలా ఫ్యాషన్ షోల్లో విజేతగా నిలిచానని తెలిపింది. రిషిక తండ్రి సురేష్‌కుమార్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తన కుమార్తెకు ఉన్న ఆసక్తిని గుర్తించి ఫ్యాషన్ రంగంలో ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. తన్వీ తల్లి ప్రసన్న రేణుక మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన ఆంధ్రా ఫ్యాషన్ పోటీల్లో కూడా తన కుమార్తె విజేతగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ రంగంలో జారీ ఎత్నిక్ వేర్, సూర్యప్రభ నందిని, రోహిత్, అరుణ్‌రతన్, నరేస్ మాస్టర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

10వేల మందితో త్రివర్ణ పతాక ప్రదర్శన రేపు



వివరాలు వెల్లడిస్తున్న బసవ కృష్ణమూర్తి

డాబాగార్డెన్స్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం వైఎస్సార్ సెంట్రల్ పార్క్‌లో 10 వేల మంది విద్యార్థులతో..25 వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించనున్నట్టు స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేవ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి కోరారు. కార్యక్రమంలో గొల్ల ప్రదీప్‌రాజు, కర్రి నరేష్, ఇషాక్ మహ్మద్, పీవీకే కుమార్, శివ దల్లై, తమ్మన విజయ్, శ్రీకాంత్, రామాయణం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి ఇసుక డిపోను తనిఖీ చేసిన కలెక్టర్



కొనుగోలుదారులను ఆరా తీస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

అగనంపూడి (గాజువాక): అగనంపూడిలోని ఇసుక డిపోను జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక డిపోలో నిల్వలు, అమ్మకాల తీరు, రవాణా చార్జీల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఎంత వరకు అమ్మకాలు సాగాయి, ఏమేరకు నిల్వలు ఉన్నాయో రికార్డులు పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇసుక కోసం వచ్చిన కొనుగోలు దారులు, ట్రాన్స్‌పోర్టు సిబ్బందితో మాట్లాడారు. ఇసుక అందించడంలో సిబ్బంది నుంచి సహకారం ఉందా , ఇబ్బందులు ఏమైనా ఉన్నా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గాజువాక మండల రెవెన్యూ సిబ్బందితోపాటు గనుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉక్కుకు సొంత గనులు కేటాయించాలి



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఇంటక్ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించడంతో పాటు సొంత గనులు కేటాయించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ కోరారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, తక్షణ సాయంగా రూ.ఐదువేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 1287వ రోజు దీక్షా శిబిరంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, రమణమూర్తి, సుబ్బయ్య, కొరివి అవతారం, ఎస్.నాయుడు, గోపాలరాజు, సాహు, ప్రసాద్, గోపి, శ్రీనివాస్, దేముడు, వేణువర్మ, కొమ్మ ప్రసాద్, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులపై భారం మోపొద్దు

యంత్ర పరికరాల అద్దె తక్షణమే చెల్లించాలి



వాయిదా సొమ్ము చెల్లించాలని పారిశుధ్య కార్మికురాలిని కోరుతున్న బ్యాంక్ సిబ్బంది

అగనంపూడి: అదనపు ఆదాయం వస్తుందని ఆశపడ్డ పారిశుధ్య కార్మికులకు జీవీఎంసీ తీరుతో అదనపు భారం పడిందని వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు అన్నారు. జీవీఎంసీ జోన్–6 అగనంపూడి పరిధిలోని కొంత మంది పారిశుధ్య కార్మికులు సఫాయి కర్మచారి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా కూర్మన్నపాలెం కెనరా బ్యాంక్‌లో రుణాలు తీసుకొని కాలువ క్లీనింగ్, ఫాగింగ్, యూడీజీల క్లీనింగ్ యంత్రపరికరాలను కొనుగోలు చేశారన్నారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్, అగనంపూడికి చెందిన పారిశుధ్య కార్మికులు చేసుకున్న ఒప్పందం మేరకు యంత్ర పరికరాలకు నెలకు రూ.90వేలు అద్దె చెల్లించాల్సి ఉందన్నారు. అయితే గతేడాది జూన్ నుంచి జీవీఎంసీ ఒప్పంద ప్రకారం అద్దె మొత్తం చెల్లించకపోవడంతో కార్మికులు బ్యాంక్ వాయిదాలుసక్రమంగా చెల్లించలేక పోతున్నారని చెప్పారు. దీంతో బ్యాంక్ సిబ్బంది వాయిదాలు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారని, తక్షణమే జీవీఎంసీ కమిషనర్ స్పందించి బకాయిలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మనువాదుల కుట్ర వల్లే వర్గీకరణ

మాజీ ఎంపీపీ జీవీ హర్షకుమార్



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ఉక్కునగరం: మనువాదుదల కుట్రల వల్లేఎస్సీ వర్గీకరణ అంశం వెలుగులోకి వచ్చిందని, దాన్ని ఐక్య ఉద్యమంతో తిప్పి కొడతామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్, అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ మాల ఉద్యోగులు ఏర్పాటు చేసిన వర్గీకరణ వ్యతిరేక పోరాట సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఇటీవల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ పరిధిలో కాకుండా మోదీ ఆదేశాలతో ఇచ్చినట్టుగా ఉందని ఆరోపించారు.

ఉప కులాల వర్గీకరణ చేయాలంటే 341 ఆర్టికల్‌ను పార్లమెంట్‌లో సవరణ చేయాల్సి ఉంటుందని, ప్రధాని మోదీ ఆ పని చేయగలరా అని ఆయన ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పును 100 మంది ఎస్సీ, ఎస్టీ ఎంపీలు వ్యతిరేకిస్తున్నారని, అందులో ఉత్తరాది మాదిగ ఎంపీలు కూడా ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణ చేసేస్తానని చంద్రబాబు అనడం దారుణమన్నారు.

మాల మహానాడు నాయకుడు బూల జగ్జీవన్ రామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కె.బి.ఆర్. అంబేడ్కర్, మాటూరి శ్రీనివాసరావు, జి.బోసు బాబు, ఎం. రాంబాబు, జి. సురేష్, బి.ఎ. స్వామి, ఎస్. రమణారావు, ఎం. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ రహితంగా ఆంధ్రా యూనివర్సిటీ



ర్యాగింగ్ రహిత క్యాంపస్ ప్రారంభోత్సవంలో ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ విజయ్‌మోహన్

విశాఖ సిటీ: ర్యాగింగ్ రహితంగా ఆంధ్రా యూనివర్సిటీని నిలపాలని విద్యార్థులకు ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ పిలుపునిచ్చారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ర్యాగింగ్ రహిత క్యాంపస్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ కారణంగా యువత జీవితం నాశనమవుతోందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడటం, ప్రోత్సహించడం సరికాదని, విద్యార్థుల మధ్య స్నేహభావం, సత్సంబంధాలు ఎంతో అవసరమని సూచించారు. ఏయూను ర్యాగింగ్ రహితంగా తీర్చి దిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే విద్యార్థి వ్యవహారాల కార్యాలయానికి తెలియజేయాలని కోరారు. నిరంతరం విద్యార్థులకు ఆచార్యులు, సిబ్బంది అవసరమైన సహకారాన్ని అందిస్తారని చెప్పారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య విజయ్‌మోహన్ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిస కాకూడదని సూచించారు. యువతరం విలువైన మానవ, మేధో వనరులుగా నిలవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆచార్య పాల్ డగ్లస్, ఆచార్య ఎస్.ఎం.యుగంధర్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న యువకులను రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు ఆదేశాలతో రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎంఎల్ మీనా రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రం బోలంగీర్‌కు చెందిన దోలమని రానా, బీహార్‌కు చెరందిన శివశంకర్ రేలు గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. విశాఖ మీదుగా ముంబై, హౌరాలకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. వీరి నుంచి సుమారు రూ.77,500 విలువైన 15.5కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని జీఆర్పీ ఎస్ఐ శాంతారంకు అప్పగించగా, వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పి సిబ్బంది తెలిపారు.